ఇఫ్తార్ 6-36
(సోమవారం సాయంత్రం)

సహర్ 4-42
(మంగళవారం తెల్లవారుజామున)

రంజాన్ వేళలు



రేషన్ బియ్యం పక్కదారి
పేదలకు తక్కువ ధరకే అందించే రేషన్ బియ్యం పథకం పక్కదారి పడుతుంది.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
42.3/26.1

వాతావరణం
ఉదయం ఉంచే ఎండ ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు బలంగా వీస్తాయి. ఉక్కపోత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన డీఎస్పీ

ఉండవెల్లి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ సత్యనారాయణ ఆదివారం తనిఖీ చేశారు. రికార్డులు, పరిసరాలను పరిశీలించారు. సమస్యలపై వినతులు ఇచ్చేందుకు వచ్చే వారితో మర్యాదగా ప్రవర్తించాలని అన్నారు. అంతకుముందు కంచుపాడు శివారులో ఎల్లమ్మ దేవాలయ స్థల వివాదంలో గత నెల 23న పాముల ఆంజనేయులుకు, విక్రమాచార్యుల మధ్య వివాదం నెలకొనగా పాముల ఆంజనేయులును విక్రమాచార్యులు కులం పేరుతో దూషించడంతో 24న కేసు నమోదైంది. ఈమేరకు డీఎస్పీ అక్కడికి వెళ్లి విచారించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాసులు, ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

దేవరకద్ర మార్కెట్‌కు వారం రోజులు సెలవు

దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు వారం రోజులు సెలవు ఉంటున్నట్లు మార్కెట్ అధికారులు ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ధాన్యం సీజన్, ఉల్లి సీజన్ ఉండడంతో రైతులు ఇబ్బందులు పడకుండా ఉండాలని సెలవుల జాబితాను విడుదల చేశారు. సోమవారం అమావాస్య కారణంగా మార్కెట్ బంద్ ఉంటుంది. అలాగే మంగళవారం ఉగాది పండుగ సెలవు కాగా.. బుధవారం మార్కెట్‌లో పనిచేసే హమాలీ, చాట, దడవాయిల కోసం కరి పండుగ సెలవుతో మార్కెట్‌లో లావాదేవీలు జరగవు. గురువారం, శుక్రవారం రంజాన్ పండుగ సెలవులు కాగా.. శనివారం తిరిగి ఒకరోజు లావాదేవీలు జరుగుతాయని మార్కెట్ అధికారులు పేర్కొన్నారు. మొత్తం మీద వరుసగా 6రోజుల పాటు మార్కెట్‌కు సెలవులు వచ్చాయి.

అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి



స్టేషన్ మహబూబ్‌నగర్: ధూప, దీప, నైవేద్య అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డీడీఎన్ఎస్ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం ఆవరణలో ఆదివారం జిల్లా ధూప, దీప, నైవేద్య అర్చక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రవికుమార్ మాట్లాడుతూ దేవాదాయ ధర్మాదాయశాఖ నుంచి ధూప, దీప, నైవేద్య అర్చకులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఆరోగ్య భద్రత కింద కార్డులు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ధూప, దీప, నైవేద్య అర్చకుల పిల్లల ఉన్నత చదువులు, వివాహాల కోసం దేవాదాయ ధర్మాదాయ వెల్ఫేర్ ఫండ్ నుంచి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ప్రతి నెలలో ఒక గ్రామంలో గుడిబాట కార్యక్రమం నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. అనంతరం జిల్లా ధూప, దీప, నైవేద్య అర్చక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జంగం మహేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా మఠం కుమారస్వామి, కోశాధికారిగా అయ్యవారి పవన్‌కుమార్ చార్యులు ఎన్నికయ్యారు.

అనైతిక రాజకీయాలతో మున్సిపల్ ఎన్నిక



వనపర్తిటౌన్: అనైతిక రాజకీయాలతో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక చేశారని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మున్నూరు రవీందర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధికార ప్రతినిధి, మీడియా ఇన్‌చార్జ్ పెద్దిరాజు ఆధ్వర్యంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వనపర్తి పట్టణాన్ని అభివృద్ధిలో పరిగెత్తిస్తామని ఎమ్మెల్యే మేఘారెడ్డి హామీ ఇచ్చారని, అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల విస్తరణపై ధ్యాసపెట్టకుండా అధికారం కోసం మేఘారెడ్డి, చిన్నారెడ్డి వర్గాలు బీఆర్ఎస్ కౌన్సిలర్లను, సర్పంచ్‌లను, ఎంపీటీసీలను, నాయకులను పార్టీలో చేర్చుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిలర్లకు, ప్రతినిధులకు పార్టీ మారే స్వేచ్ఛ ఉంటుందని, అలాగే ఆ పార్టీ ద్వారా వచ్చిన పదవికి రాజీనామా చేయాలన్నారు. అలా కాకుండా వనపర్తి మున్సిపాలిటీలో అధికారం కోసం అనైతిక చర్యలకు పాల్పడ్డ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లను అనర్హులుగా ప్రకటించి, పాలకవర్గాన్ని రద్దు చేయాలనిన్నారు.



బీచుపల్లి వద్ద జాతీయ రహదారి బ్రిడ్జి దిగువ ప్రాంతంలో ఎండిన కృష్ణానది



రాజోలి మండలం తుమ్మిళ్ల వద్ద ఎండిన తుంగభద్ర నది

వట్టిపోయిన జీవనదులు

కృష్ణా, తుంగభద్రలో కనిపించని నీటిజాడలు

- సుంకేసుల బ్యారేజీలోనూ అదే పరిస్థితి
- వర్షాభావంతో అడుగంటిన భూగర్భజలాలు
- ఈసారి వేసవిలో తాగునీటికి దినదినగండాలే..
- రైతులకు తప్పని సాగునీటి కష్టాలు

జల గోస

అలంపూర్: ఉమ్మడి జిల్లాలో సాగు, తాగునీటికి మేమున్నామంటూ భరోసా ఇచ్చిన కృష్ణా, తుంగభద్ర నదులు వట్టిపోయాయి. ఈ ఏడాది తీవ్రమైన వర్షాభావంతో గతంలో ఎప్పుడూ లేనంతగా జీవనదులు జీవచ్ఛవంలా కనిపిస్తున్నాయి. వర్షాకాలంలో ఆ ఒడ్డు.. ఈ ఒడ్డు అంటూ ఆనుకొని ప్రవహించిన నదులు.. కనీసం నీటిపాయలు లేకుండా పోయాయి. గతంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా నదిలో కొంత ఇసుక తవ్వితే ఊటలా నీళ్లు ఉబికివచ్చేవి. కానీ, ప్రస్తుతం అలాంటి జాడలేమీ లేకపోవడంతో నదీతీర ప్రాంతాల్లో జల ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. జిల్లాలో రెండు జీవనదులు పారుతున్నా.. పంటలు సాగుచేసిన రైతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా తయారవగా.. గుక్కెడు తాగునీటికి అష్టకష్టాలు పడాల్సి వస్తోంది.

సుంకేసుల బ్యారేజీలో..

తుంగభద్ర నది జలాలపై ఆధారపడి నిర్మించిన సుంకేసుల బ్యారేజీలో నీళ్లు అడుగంటాయి. రాజోలి వద్ద ఉన్న సుంకేసుల బ్యారేజీలో నీళ్లు లేక వెలవెలబోతుంది. తెలంగాణ– ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో నిర్మితమైన సుంకేసుల బ్యారేజీతో అలంపూర్ ప్రాంతానికి కొంత వరకు లబ్ధి చేకూరుతోంది. కర్నూలు–కడప జిల్లాలకు తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చడంతో దీన్ని ఆనకట్ట నుంచి బ్యారేజీగా నిర్మాణం చేపటారు. ఆనకట్ట ఉన్న ప్రాంతంలోనే దాదాపు 298 మీటర్ల ఎత్తులో 30 గేట్లతో బ్యారేజీ నిర్మించారు. సాధారణంగా సుంకేసుల బ్యారేజీ నీటి నిల్వ సామర్థ్యం 1.2 టీఎంసీలు. బ్యారేజీ కింద ప్రధానంగా కర్నూలు– కడప కెనాల్ ద్వారా ఆ రెండు ప్రాంతాలకు తాగు, సాగునీరు అందిస్తున్నారు. అలాగే బ్యారేజీకి దిగువన ఉన్న రాజోలి, ఉండవెల్లి, అలంపూర్, మానవపాడు మండలాల్లోని పలు గ్రామాలకు తాగునీటిని అందిస్తున్నారు. బ్యారేజీలో నిల్వ ఉన్న నీళ్లు రోజురోజుకు తగ్గుతున్నాయి. ప్రస్తుతం బ్యారేజీలో 0.5 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ స్థాయిలో నీళ్లు ఉండటంతో గేట్లు తెరిచి కిందికి వదిలే పరిస్థితి లేదంటున్నారు. గతేడాది ఈ సమయంలో టీఎంసీ నీళ్లు ఉండేవి. ప్రస్తుతం పైనున్న ప్రాజెక్టుల నుంచి నీళ్లు వచ్చే పరిస్థితి లేకపోవడంతో బ్యారేజీ దిగువ ప్రాంతంలో నది ఎండిపోయి రాళ్ల రప్పలతో అందవిహీనంగా కనిపిస్తోంది. ప్రస్తుతం వీటిపై ఆధారపడిన ఈ రెండు ప్రాంతాల్లో తాగు, సాగునీటికి కష్టాలు తప్పడం లేదు. భవిష్యత్‌లో మరిన్ని నీటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని నదీతీర ప్రాంత ప్రజలు భయపడుతున్నారు.

ఇవే ప్రధాన ఆదెరువు

ఉమ్మడి జిల్లాలో ఉన్న రెండు జీవనదులు తాగు, సాగునీటి అవసరాలు తీర్చుతున్నాయి. ఈ నదులపై ఆధారపడి ప్రాజెక్టులు, బ్యారేజీలు, సాగునీటి ఎత్తిపోతలు, అనేక తాగునీటి పథకాలు నిర్మించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన మిషన్ భగీరథ పథకం సైతం వీటి ఆధారంగానే నిర్మించారు. గద్వాల జిల్లాలో కృష్ణానదిపై సాగునీటిని అందించడానికి జూరాల ప్రాజెక్టు, తుంగభద్ర నదిలో ఆర్డీఎస్‌తోపాటు కొత్తగా తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం నిర్మించారు. తుమ్మిళ్ల ద్వారా 50 వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి లక్ష్యంగా నిర్దేశించారు. సుంకేసుల బ్యారేజీ వద్ద రాజోలి ఎగువ ప్రాంతంలోని రాజోలి రామేశ్వరస్వామి ఎత్తిపోతల పథకం ద్వారా 1,500 ఎకరాలు, దిగువనున్న బుడ్డమర్సు 1, 2 ఎత్తిపోతల పథకాల ద్వారా సుమారు 560 ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉంటుంది.

■ తుంగభద్ర నదిపై ఆధారపడి ఆర్డీఎస్ ఆనకట్ట నిర్మించారు. ఈ ఆనకట్ట ద్వారా నియోజకవర్గంలోని 87,500 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. తుంగభద్ర నదిపైనే 60 వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి తుమ్మిళ్ల ఎత్తిపోతలు చేపట్టారు. కృష్ణానది జలాలపై ఆధారపడి జూరాల లింకు కెనాల్‌తోపాటు అలంపూర్ మండలంలో అలంపూర్ ఎత్తిపోతలు, క్యాతూర్‌లో రెండు, ఉట్కూరులో రెండు, బుక్కాపురం ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. ఈ పథకాల ద్వారా సుమారు 20 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంటుంది. అలాగే నియోజకవర్గంలోని గ్రామాలకు 16 వరకు తాగునీటి పథకాలు నిర్మించారు. ఈ తాగునీటి పథకాల ద్వారా 50 వరకు గ్రామాలకు గతంలో తాగునీటి సరఫరా జరిగేది. మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సరఫరా చేస్తుండటంతో వీటిని వినియోగించడం లేదు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు తలెత్తడంతో నదుల్లో నీళ్లు ఉండి ఉంటే వీటి ద్వారా తాగునీరు సరఫరా చేసే అవకాశం ఉంటుంది.

కాలంతో పయనించేవాడే కవి



స్టేషన్ మహబూబ్‌నగర్: కాలంతో పయనించేవాడే కవి, కాలానుగుణంగా వర్తమాన అంశాలను ఒడిసి పట్టుకొని కవిత్వం రాయడమే కవి పని అని ప్రముఖ సామాజికవేత్త, దక్కన్ ల్యాండ్ మాసపత్రిక సంపాదకుడు మణికొండ వేదకుమార్ అన్నారు. లుంబిని పాఠశాల, పాలమూరు సాహితీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక లుంబిని పాఠశాలలో నిర్వహించిన శ్రీక్రోధినామ సంవత్సరం ఉగాది కవి సమ్మేళనంలో వేదకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వర్తమాన సమస్యలను ప్రపంచానికి చాటే విధంగా కవి ప్రయత్నిస్తాడని, ఆ ప్రయత్నంలో భాగంగా సమాజ మార్పును ఆహ్వానిస్తాడన్నారు. పర్యావరణానికి అనుకూలంగా కవులు కవిత్వం రాయాలని, అప్పుడు సమాజం సుభిక్షంగా ఉంటుందన్నారు. సభకు అధ్యక్షత వహించిన లక్ష్మణ్‌గౌడ్ మాట్లాడుతూ 20 ఏళ్లుగా లుంబిని పాఠశాలలో ఉగాది కవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా ఎంతోమంది యువకవులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ప్రధానవక్త ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రఘు మాట్లాడుతూ కవులు పఠనాసక్తిని పెంపొందించుకోవాలని, పఠనం ద్వారానే కవిత్వంలో రాణిస్తారన్నారు. సమకాలీన సామాజిక, రాజకీయ అంశాలను గ్రహించి కవి తనదైన శైలిలో కవిత్వం ఆవిష్కరించాలన్నారు. ప్రముఖ న్యాయవాది మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎంతో మంది కవులు ఆవిర్భవిస్తున్నారని, వారిని ఎన్నో సాహిత్య సంస్థలు ప్రోత్సహిస్తుండడం అభినందనీయమని అన్నారు. అనంతరం శ్రీక్రోధి నామసంవత్సర ఉగాది పురస్కారాలను బెల్లం సాయిలు, తగుళ్ల గోపాల్‌కు అందజేశారు. కవులు తమ కవితలను వినిపించారు. మణికొండ వేదకుమార్ సంపాదకత్వంలో 'బాల చెలిమి' పిల్లల మాసపత్రికను ఆవిష్కరించారు. పాలమూరు సాహితీ అధ్యక్షుడు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, వనపట్ల సుబ్బయ్య, కోట్ల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ముమ్మర తనిఖీలు



పుల్లూరు టోల్ ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎన్నికల వేళ నిఘా పెంచిన పోలీసులు

- జిల్లాలో 5 చెక్‌పోస్టుల ఏర్పాటు
- వాహనాల తనిఖీల్లో పట్టుబడుతున్న నగదు, మద్యం
- గ్రామాలు, మండల కేంద్రాల్లో కేంద్ర బలగాల కవాతు
- రూ.50వేలపైన నగదు తరలిస్తే ఆధారాలు తప్పనిసరి.. పెళ్లిళ్ల సీజన్ కావడంతో పరేషాన్

గద్వాల క్రైం: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అడుగడుగునా నిఘా కట్టుదిట్టం చేశారు. సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా నగదు అక్రమ రవాణా, మద్యం పంపిణీకి అడ్డుకట్ట వేసేలా పోలీసులు చర్యలు చేపట్టారు. పటిష్ట నిఘాకు జిల్లా పోలీసులకు తోడుగా కేంద్ర బలగాలు రంగంలోకి దిగాయి. జిల్లా మండల కేంద్రాల్లో కవాతు నిర్వహిస్తున్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని గద్వాల, అలంపూర్, అయిజ, వడ్డేపల్లి మున్సిపాలిటీలతోపాటు అన్ని మండలాల పరిధిలోనూ సజావుగా ఎన్నికలు జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రెవెన్యూశాఖను సమన్వయం చేసుకుంటూ సమస్యాత్మక ప్రాంతాలను గుర్తిస్తూ తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించారు. జిల్లాలోని రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని పోలీసులు ఆదేశాలు జారీ చేశారు.

నగదు పట్టుబడిన ఘటనలు ఇలా..

■ ఈ నెల 2వ తేదీన ఉండవల్లి పరిధిలోని పుల్లూరు చెక్‌పోస్టు వద్ద సిబ్బంది వాహనాలు తనిఖీ చేసిన క్రమంలో ఎలాంటి రశీదు లేకుండా రూ.11 లక్షల నగదు తీసుకెళ్తున్న గ్రామంలో అధికారులు గుర్తించి అట్టి నగదును సీజ్ చేశారు.

■ 3వ తేదీన కేటీదొడ్డి మండలంలోని నందిన్నె చెక్‌పోస్టు వద్ద అధికారులు వాహనాల తనిఖీలో రూ.54 వేల నగదును గుర్తించి సీజ్ చేశారు.

■ 4వ తేదీన ఉండవల్లి పరిధిలోని పుల్లూరు చెక్‌పోస్టు వద్ద అధికారులు ఎలాంటి రశీదు లేని రూ.1,97,500 నగదును సీజ్ చేశారు.

చెక్‌పోస్టుల ఏర్పాటు..

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలను పోలీసులు ముమ్మరం చేశారు. జిల్లా సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టుల వద్ద కేంద్ర సాయుధ బలగాలతో భద్రత పెంచడం జరిగింది. జిల్లా సరిహద్దులో అంతరాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. పుల్లూర్ టోల్‌గేట్, అలంపూర్–ర్యాలంపాడు, సుంకేసుల, నందిన్నె, బల్గెరల వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి కేంద్ర సాయుధ పోలీస్ బలగాలు, జిల్లా పోలీస్‌లతో తనిఖీలు చేపట్టారు. ఆయా రాజకీయ పార్టీల నాయకులు ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేయకుండా.. అలాగే ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణాన్ని కల్పించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు తీసుకుంది. భారీ మొత్తంలో నగదు తరలించకుండా అడ్డుకునేందుకు ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. అంతర్రాష్ట్ర సరిహద్దుతో పాటు ప్రత్యేక బృందాలు ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వైలెన్స్ టీం, స్టాటిక్ సర్వైలెన్ టీంలు జిల్లా అంతటా తనిఖీలు చేస్తున్నాయి.

సామాన్యుడి పరేషాన్..
ఇదిలాఉండగా, ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉండడం, ఆంక్షలు విధించడం శుభకార్యాలపై ప్రభావం చూపుతున్నాయి. వివాహాల సందర్భంలో నూతన వస్త్రాలు, బంగారం, ఇతర వస్తువులు కొనుగోలు చేయడం, అవసరమైన నిత్యావసర వస్తువులు, వాహనాలు, ఇతర సామగ్రి కొనుగోలు చేయడం, ఫంక్షన్‌హాళ్లు, డెకరేషన్, క్యాటరింగ్.. ఇలా అన్నింటికీ పెద్దమొత్తంలో డబ్బులు అవసరం ఉంటుంది. ఎలక్షన్ కోడ్ అమల్లో ఉండడంతో వీరికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్తే సీజ్ చేస్తుండడం ఇబ్బందిగా మారిందని పలువురు వాపోతున్నారు. నగదుకు సంబంధించి సరైన ఆధారాలు చూపకపోయినా, వెండి, బంగారు ఆభరణాలు పెద్ద మొత్తంలో తీసుకెళ్తున్నా స్వాధీనం చేసుకుంటున్నారు. శుభకార్యాల కోసం బ్యాంకుల నుంచి ఎప్పుడో డబ్బు డ్రా చేసి పెట్టుకున్న వారు, వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు తీసుకున్నవారు ఆ డబ్బును తీసుకువెళ్లే క్రమంలో ఇబ్బందుల పాలవుతున్నారు. బ్యాంకు నుంచి డబ్బు డ్రా చేస్తే సంబంధిత రశీదు చూపాలి. రూ.10లక్షల్లోపు నగదు వెంట ఉండి అన్నీ సక్రమంగా ఉంటే అధికారులు వదిలేస్తారు. రూ. 10లక్షలు ఆపైన ఉంటే సీజ్ చేసి ఇన్‌కంట్యాక్స్ అధికారులకు అప్పగిస్తారు.

రూ.25లక్షలు సీజ్ చేశాం..



లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం చేశాం. రూ.50వేల కంటే ఎక్కువ నగదు ఉంటే వాటికి సంబంధించిన రశీదులు సంబంధిత అధికారులకు తప్పక చూపించాలి. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ. 25.57లక్షల నగదును సీజ్ చేశాం. సీజ్ చేసిన నగదును ఎలక్షన్ కమిటీ అధికారులకు అప్పగించం. అక్రమంగా తరలిస్తున్న 1,867 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నాం. ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహిస్తాం. ఇప్పటికే కేంద్ర బలగాలు, జిల్లా పోలీసుశాఖ విధులు నిర్వహిస్తున్నాయి.
– రితిరాజ్, ఎస్పీ



కేంద్ర బలగాలతో మాట్లాడుతున్న ఎస్పీ



అలంపూర్ చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన మద్యం

'చీటింగ్' సెంటర్లు

- అనుమతుల్లేకుండా కొనసాగుతున్న కోచింగ్ సెంటర్లు
- నోటిఫికేషన్లు వచ్చిన ప్రతిసారి విచ్చలవిడిగా ఏర్పాటు
- హంగు ఆర్భాటాలతో నిలువునా ముంచుతున్న వైనం
- అడ్డగోలుగా ఫీజులు.. ఆర్థికంగా నష్టపోతున్న అభ్యర్థులు
- చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ ఇచ్చిన ప్రతిసారి ఉమ్మడి జిల్లాలో తాత్కాలికంగా కోచింగ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కోచింగ్ ప్రారంభంలో అభ్యర్థులకు అనేక హామీలిచ్చే యాజమాన్యాలు చివరికొచ్చే సరికి పరిస్థితులు పూర్తిగా మారిపోతున్నాయి. గతంలో కొన్ని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు సిలబస్ సైతం పూర్తి చేయకుండా.. మెటీరియల్ ఇవ్వకుండా మధ్యలోనే బోర్డు తిప్పేసిన దాఖలాలు లేకపోలేదు. అలాగే కనీస వసతులు, ఫైర్ సేఫ్టీ వంటివి మచ్చుకైనా కనిపించవు. ప్రభుత్వ అనుమతితోనే కోచింగ్ సెంటర్ నిర్వహించాలనే నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. వీటిని ఇటు విద్యాశాఖ, అటు నిర్వాహకులు ఇద్దరూ తుంగలో తొక్కేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.


నవోదయ నుంచి గురుకులం వరకు..
ఉమ్మడి జిల్లాలోని వనపర్తి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ ఎక్కువగా కోచింగ్ సెంటర్లను ప్రైవేటు యాజమాన్యాలు నిర్వహిస్తున్నాయి. ఇందులో ఎంసెట్, నీట్, పోలీస్, గ్రూప్స్, డీఎస్సీ, గురుకుల, నవోదయ, ఎస్సెస్సీ పరీక్షల కోసం, స్పోకెన్ ఇంగ్లిష్ వంటి వాటిపై శిక్షణ ఇస్తున్నాయి. మొత్తం ఉమ్మడి జిల్లాలో సుమారుగా అన్ని వివిధ స్థాయిల్లో 90 వరకు కోచింగ్ సెంటర్లు ఉంటాయని అంచనా. వీటిలో ప్రభుత్వ అనుమతి తీసుకున్నవి 5 కంటే తక్కువే ఉంటాయని స్వయంగా అధికారులే అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ఎంసెట్, నీట్‌కు ఇంటర్మీడియట్ కళాశాలల్లో ఇప్పటికే చాలా వరకు శిక్షణ ఇస్తున్నాయి. కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో సైతం ఎస్సెస్సీ, గురుకుల, నవోదయకు శిక్షణ ఇస్తున్నారు.

ఫిర్యాదు ఇచ్చినా.. చర్యలేవీ?

గతంలో జిల్లాకేంద్రంలోని ఓ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులకు సిలబస్ పూర్తి చేయలేదని, మెటీరియల్ ఇవ్వలేదని, అధిక ఫీజులు తీసుకున్నారని ఓ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే ఆయన చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఆదేశించారు. దీంతో పోలీస్ అధికారులు విద్యాశాఖ ద్వారా మహబూబ్‌నగర్‌లోని అన్ని కోచింగ్ సెంటర్ల వివరాలు సేకరించారు. వీటికి సంబంధించి పూర్తి వివరాలను మహబూబ్‌నగర్ అర్బన్ ఎంఈఓ పోలీస్‌లకు సమాచారం ఇచ్చారు. ఆ తర్వాత ఇటు పోలీసులు గాని.. అటు విద్యాశాఖ గాని ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రతిసారి ఏదో కోచింగ్ సెంటర్‌లో ఇబ్బందులు తలెత్తడం.. అభ్యర్థులు ఫిర్యాదు చేయడం పరిపాటిగా మారుతోంది.


స్పష్టమైన ఆదేశాలు లేక..
కోచింగ్ సెంటర్‌లో ఎంత ఫీజు వసూలు చేయాలి.. అనే అంశంపై స్పష్టమైన ఆదేశాలు లేకపోవడంతో నిర్వాహకులు అభ్యర్థుల నుంచి అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. మంచి మెటీరియల్ ఇస్తామని, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక నిపుణులైన అధ్యాపకులను పిలిపించి బోధిస్తామని హామీలు ఇచ్చి ఫీజులు తీసుకున్నాక సిలబస్ సైతం పూర్తి చేయని సంఘటలు అనేకం ఉన్నాయి. మరుగుదొడ్లు, తాగునీరు, తరగతి గదులు సరిగా లేకపోవడం వంటి సమస్యలు కోచింగ్ సెంటర్లలో వేధిస్తున్నాయి. వీటిపై విద్యాశాఖ అధికారులు దృష్టిసారించాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

వెంటనే స్పందించాలి



గతంలో అనుమతి లేని కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే కలెక్టర్ ఎస్పీ రాశారు. వారి ఆదేశాలతో విద్యా శాఖాధికారులు ఎంక్వైరీ చేయించి పూర్తి వివరాలతో కూడిన రిపోర్టును పోలీసులకు ఇచ్చారు. అయితే రిపోర్టు వెళ్లాక కూడా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా వెంటనే స్పందించాలి.
– భరత్, గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

అనుమతులు తీసుకోవాలి



కోచింగ్ సెంటర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఉంటేనే నిర్వహించాలి. కోచింగ్ సెంటర్లపై అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు ఫిర్యాదులు ఇస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. గతంలో కోచింగ్ సెంటర్లపై జరిగిన అంశాలను తెలుసుకుని తదుపరి చర్యలు చేపడుతాం.
– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్

క్లుప్తంగా

అత్తారింటి వద్ద అల్లుడు ఆత్మహత్య?

అచ్చంపేట రూరల్: ఒంటిపై పెట్రోల్ పోసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం మండలంలోని రంగాపూర్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. బల్మూర్ మండలం గోదల్ చెందిన వావిలాల సుభాష్‌రెడ్డి(35) రంగాపూర్ చెందిన చంద్రయ్య కూతురు లోహితతో గతేడాది వివాహమైంది. కొన్ని నెలల పాటు సాఫీగా సాగిన సంసారం, ఇద్దరి మధ్య మనస్పార్థాలతో భార్య పుట్టినిల్లయిన రంగాపూర్‌లో ఉంటుంది. ఆదివారం ఉదయం రంగాపూర్‌కు వచ్చిన సుభాష్‌రెడ్డి అత్తారింట్లో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే సగం శరీరభాగం కాలిపోయింది. అపస్మారస్థితిలో ఉన్న యువకుడిని 108 అంబులెన్సులో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. వైద్యం పొందుతూ అక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా తనను హత్య చేయడానికి అత్తామామ, భార్య యత్నించారని పోలీసులకు వాంగ్మూలంలో సుభాష్‌రెడ్డి తెలిపినట్లు, అచ్చంపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో ఓ వీడియోలో స్పష్టంగా చెప్పారు. మృతుడి సోదరుడు ప్రతాప్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయనున్నట్లు ఎస్‌ఐ రాములు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..

బిజినేపల్లి: ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక తిమ్మాజిపేట మండలంలోని అప్పాజిపల్లికి చెందిన కావలి శ్రీకాంత్ (27) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అప్పాజిపల్లికి చెందిన కావలి శ్రీకాంత్ కారు డ్రైవింగ్ చేస్తుంటాడు. ఈ మధ్యకాలంలో కారు సక్రమంగా నడవకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. కారు కోసం చేసిన కిస్తులు, ఇంట్లో కుటుంబపోషణ భారమై మనస్తాపం చెందాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీకాంత్ తండ్రి సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి ఉరేసుకుని కన్పించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మహమ్మదాబాద్: బైక్‌పై నుంచి కిందపడి వ్యక్తి మృతి చెందిన ఘటన గండేడ్ మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దవార్వాల్ చెందిన వెంకటయ్య (40) శనివారం మధ్యాహ్నం తన సొంత పనిమీద చిన్నవార్వాల్ వెళ్తుండగా మార్గమధ్యలో ప్రమాదవశాత్తు కిందపడి గాయాలయ్యాయి. ఆయనను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స పొందుతుండగా ఆదివారం చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మహమ్మదాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

మడుగులో పడి వ్యక్తి..

పెద్దకొత్తపల్లి: దేదినేనిపల్లి శివారులో అదే గ్రామానికి చెందిన చిన్నకుర్మయ్య గుంటి మడుగులో పడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. చిన్న కుర్మయ్య ఆదివారం మైసమ్మ జాతరకు వెళ్లి తిరిగి గ్రామానికి నడిచి వస్తూ వేడికి దప్పిక వేయడంతో గుంటి మడుగులోకి వెళ్లి ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడు. మృతుడు హైదరాబాద్‌లో ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. ఈయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

చెరువులో మృతదేహం లభ్యం

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ చెందిన రాములు (37) శనివారం భీమసముద్రం చెరువులో గల్లంతై, ఆదివారం ఉదయం లభ్యమయ్యాడు. గ్రామంలో దాయాది దశదినకర్మలో భాగంగా భీమసముద్రం చెరువు వద్ద స్నానం కోసం వెళ్లాడు. రాములు సహచరులతో కలిసి చెరువులో ఈత కొడుతూ ఆయాసంతో నీట మునిగాడు. విషయం గమనించిన దాయాదులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. అధికార యంత్రాంగం మృతదేహం కోసం రాత్రంతా పడిగాపులు కాయగా, ఆదివారం ఉదయం బయటికి వచ్చింది. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య రేణుక, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నాడు.

పశుగ్రాసం దగ్ధం

తెలకపల్లి: అగ్నిప్రమాదంలో పశుగ్రాసం దగ్ధమైంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గట్టురాయిపాకులలో ఆదివారం సూగూరు శ్రీనుకు చెందిన గడ్డివాములకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. ఐదు బండ్ల గడ్డి పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపుచేశారు. గడ్డివాములతో పాటు వ్యవసాయ పనిముట్లు, ఇతర సామగ్రి కాలిపోయాయి. దాదాపు రూ.లక్షకు పైగా ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

రేషన్ బియ్యం పక్కదారి



- కర్ణాటక, మహారాష్ట్రకు తరలింపు
- పట్టించుకోని అధికారులు

గండేడ్: పేదరిక నిర్మూలనలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత రేషన్ బియ్యం పథకం పక్కదారి పడుతుంది. టన్నుల కొద్ది బియ్యం సరిహద్దులు దాటి వెళ్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. కొన్ని గ్రామాల్లో అడ్డాలు పెట్టుకుని వ్యాపారం చేస్తున్నారు. ఉమ్మడి గండేడ్, మహమ్మదాబాద్ మండలాల పరిధిలో 46 రేషన్‌షాపులు ఉండగా మొత్తం 19,067 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలో 15,043 తెల్లరేషన్ కార్డులు, 4,008 అంత్యోదయ కార్డులు, 16 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. తెల్లరేషన్ కార్డులకు 2103.1 క్వింటాళ్ల బియ్యం కేటాయించగా, అంత్యోదయ కార్డులకు 1,162.95 క్వింటాళ్లు, అన్నపూర్ణ కార్డులకు 1.6 కింటాళ్ల బియ్యం నెలనెల సరఫరా చేస్తున్నారు.

రాష్ట్రాలు దాటుతున్న బియ్యం..

గ్రామాల్లో వ్యాపారులు సేకరించిన బియ్యం రాష్ట్రాలు దాటుతున్నాయి. రాష్ట్రం నుంచి పక్క రాష్ట్రాలయినా కర్ణాటక , మహరాష్ట్రకు తరలుతున్నాయి. మొదటగా చిన్న చిన్న ఆటోల్లో వీటిని సేకరించి ఒక చోటకు చేరుస్తున్నారు. కొంత జమయిన తర్వాత డీసీఎం, బొలెరో వాహనాల్లో తరలిస్తున్నారు. కొందరు మహారాష్ట్ర వరకు బొలెరో వాహనాల్లో బియ్యాన్ని తీసుకెళ్తున్నారు. ఎవరైనా అడిగితే ఇక్కడి వారు మహారాష్ట్రలో ఉన్నారని అలాంటి వారి బియ్యం సేకరించి వారున్న దగ్గరికి చేరవేస్తున్నట్లు చెవుతున్నారు. గతంలో ఇలా తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకుంటే అప్పటి కలెక్టర్ వెంకట్రావు నేరుగా జోక్యం చేసుకుని విడిపించారు. కానీ అందులో వాస్తవం లేదు. కొత్లాబాద్ పగిడ్యాల్ రూట్‌లో రెగ్యులర్‌గా ఓ బొలెరో వాహనం బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం. కొన్నేళ్లుగా నిరాటంకంగా సాగుతున్నది. సల్కర్‌పేట్ , నంచర్ల, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని సేకరించి రాష్ట్రం దాటవేస్తున్నారు.



ఇటీవల కోస్గిలో పట్టుబడ్డ రేషన్ బియ్యం (ఫైల్)

ప్రధాన కూడళ్లల్లో అడ్డాలు..

అక్రమంగా బియ్యం వ్యాపారం చేసేవారు. ప్రధాన గ్రామాల కూడళ్లలో అడ్డాలు పెట్టుకున్నారు. రెండు గ్రామాలకు వెళ్లే దారిలో షాపును అద్దెకు తీసుకొని ఇతర దందా చేసినట్లు చెబుతూ నూకలు, వేరుశనగ, కందులు, రాగులు ఇలా రకరకాల వస్తువులతో పాటు గుట్టుచప్పుడు కాకుండా రేషన్ బియ్యం సేకరిస్తున్నారు. ప్రజల వద్ద నుంచి కిలోకు రూ.పది చొప్పున సేకరించి వారు బయట అధిక ధరలకు అమ్ముకుంటున్నారు.

మా దృష్టికి రాలేదు..



రేషన్ బియ్యం పక్కదారి పడుతున్న విషయం తమ దృష్టికి ఇప్పటి వరకు రాలేదు. ప్రజలు రేషన్ బియ్యం అమ్ముకుంటే చర్యలు తీసుకుంటాం. డీలర్లు అక్రమ వ్యాపారం నిర్వహిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటాం. లబ్ధిదారులకు వేయాల్సిన బియ్యం వారికి ఖచ్చితంగా వేయాలి. ఇప్పటి నుంచి రేషన్ షాపులపై దృష్టి పెడతాం.

– నాగలక్ష్మి, తహసీల్దార్, గండేడ్ మండలం

మార్కెట్లో మంచి డిమాండ్

మార్కెట్లో రేషన్ బియ్యానికి మంచి డిమాండ్ ఉంది. పౌల్ట్రీ ఫారాలు ఎక్కువగా ఉండడంతో వాటికి దాణాగా వీటిని వినియోగిస్తున్నారు. దీంతో పాటు బీర్ల తయారీకి బియ్యాన్ని ఇటీవల ఎక్కువగా వినియోగిస్తున్నారు. కల్లు తయారీలో సైతం వీటిని వినియోగిస్తున్నారు. మండలంలో నలుగురు వ్యక్తులు బియ్యం వ్యాపారం చేసే వారి దగ్గర మామూళ్లు సేకరించి బియ్యం తరలింపును అడ్డుకోకుండా అధికారులకు అందజేస్తున్నట్లు సమాచారం. కొంత మంది డీలర్లు కూడా ఈ బియ్యం సేకరించి అక్రమ వ్యాపారులకు అమ్ముతున్నట్లు తెలిసింది. గతంలో మహమ్మదాబాద్, కోస్గి, దౌల్తాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో రేషన్ బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేసినా పరిస్థితిలో మార్పు లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలి.

అడవిలో ఎగసిపడిన మంటలు



నల్లమల అభయారణ్యంలో మంటలు ఆర్పుతున్న అటవీశాఖ సిబ్బంది



అభయారణ్యంలో ఎగిసి పడుతున్న మంటలు

మన్ననూర్: అమ్రాబాద్ అభయారణ్యంలో శనివారం అర్ధరాత్రి మంటలు చెలరేగిన సంఘతి విధితమే. మన్ననూర్ రేంజ్ వెస్ట్ బీట్ తాళ్ల చెలుక, గుండంతో పాటూ బోరెడ్డిపల్లి వాగు, తదితర ప్రాంతాల్లో అకస్మాత్తుగా మంటలు సంభవించాయి. దీంతో సుమారు 75 హెక్టార్లలో అటవి దగ్ధమైంది. ఈ మంటలు మానవ కల్పితమా ప్రకృతి సహజంగా ఏర్పడిన మంటలా అనే కోణంలో అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా.. అడవి తగుల బడి పోతుందనే సమాచారం తెలియగానే డీఎఫ్ఓ రోహిత్ రెడ్డి, అధికారులు ఆదిత్య, ఈశ్వర్ ఎఫ్ఆర్ఓలు, బీట్ ఆఫీసర్లు, బేస్ క్యాంపు, ఫైర్ వాచర్లతో పాటూ రెండు వాటర్ ట్యాంకర్లు, బ్రోజర్‌లతో హుటాహుటిన సంఘటన ప్రాంతానికి వెళ్లారు. భయంకరమైన వాతావరణంలో మంటలను అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నాలు చేశారు. ఏది ఏమైనా ఇలాంటి భయంకర మంటలు వ్యాప్తి చెందడంతో అటవిలో ఉండే మూగజీవాలు క్రిములు, కీటకాలు అనేకం మృత్యువాతపడే అవకాశం ఉంది. అందుకు గానూ అటవీ పరిసర ప్రాంతానికి అనుసరించి ఉన్న గ్రామాల ప్రజలు, అడవులకు వెళ్లే వారు తమ బాధ్యతగా అటవి ప్రాంతంలో అగ్నికి సంబంధించి ఎలాంటి చర్యలకు పాల్పడకుండా ఉండాలని అధికారులు తెలియజేస్తున్నారు. ప్రధాన రహదారిలో ప్రయాణం చేస్తున్న క్రమంలో మార్గమధ్యలో(అటవి ప్రాంతం) ఎక్కడైన వాహనాలు నిలుపకూడదు, అనుమతి లేకుండా అటవీ సరిహద్దు పరిసర ప్రాంతంలో సంచరించడాన్ని పూర్తిగా నిషేధించడం జరిగిందన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని డీఎఫ్ఓ తెలియజేశారు.

వీధికుక్కల వీరంగం



నాగర్‌కర్నూల్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద స్వైరవిహారం చేస్తున్న వీధికుక్కలు

- వేసవి తీవ్రతతో పిచ్చిగా ప్రవర్తిస్తున్న శునకాలు
- రోజురోజుకూ పెరుగుతున్న కుక్కకాట్లు
- భయాందోళనలో ప్రజలు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో వ్యాక్సిన్లు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కలు వీరంగం సృష్టిస్తున్నాయి. ఓవైపు వేసవి తీవ్రత అధికం కావడం.. మరోవైపు తినేందుకు తిండి లేక, తాగేందుకు నీరు లేక పిచ్చిగా ప్రవరిస్తూ, దాడులకు పాల్పడుతున్నాయి. జిల్లా కేంద్రంతో పాటు కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాల్లోని పట్టణాలు, గ్రామాల్లో నిత్యం ఎక్కడో ఒకచోట కుక్కల దాడులు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలోని ఎండబెట్లలో పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న 10 మంది చిన్నారులపై వీధికుక్కలు దాడిచేసి, గాయపర్చాయి. శ్రీపురంలో నలుగురు చిన్నారులు, ఓ యువకుడిపై దాడి చేయడంతో జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. పలు ప్రాంతాల్లో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చిన్నారులు, వృద్ధులను బయటికి పంపేందుకు జంకుతున్నారు.

కుక్కకాటుపై నిర్లక్ష్యం వద్దు..

పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్లు వేయించడం వల్ల ఎవరినైనా కరిచినా ఎలాంటి ప్రభావం ఉండదు. వీధికుక్క కాటుతో రేబిస్ వ్యాధిన పడే అవకాశం ఉంటుంది. కుక్కకాటుకు గురైన వారు వెంటనే చికిత్స చేయించుకోవాలి. అదేవిధంగా మనిషిని కరిచిన కుక్కను నాలుగు రోజుల పాటు గమనించాలని.. ఆ కుక్క మరణిస్తే, వెంటనే యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

అధికారుల చర్యలు శూన్యం..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నా.. సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. వేసవిలో వాటిని కట్టడి చేయకపోవడంతో కుక్కకాట్లు పెరిగిపోతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీధికుక్కల సంఖ్య పెరగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో నాలుగేళ్లుగా వీధికుక్కల బారినపడి, ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారు ఎంతో మంది ఉన్నారు. ఇప్పటి వరకు ఎవరూ కూడా రేబిస్ వ్యాధి బారిన పడలేదు. కుక్క కాటు బాధితులు క్రమం తప్పకుండా వ్యాక్సిన్ వేయించుకొని, ఇతర రోగాల ముప్పు నుంచి తప్పించుకున్నారు. 2021లో 1532 మంది కుక్కకాటుకు గురికాగా.. 2022లో 1,764 మంది, 2023లో 2,296 మంది, 2024 జనవరిలో 208 మంది, ఫిబ్రవరిలో 221 మంది, మార్చిలో 425 మంది కుక్కకాటు బారిన పడ్డారని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. కాగా, అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఎవరైనా వీధికుక్కల బారిన పడితే, నిర్లక్ష్యం చేయకుండా చికిత్స చేయించుకోవాలని సూచిస్తున్నారు.

కుక్కల బారి నుంచి కాపాడాలి..



ఎక్కడ చూసినా కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వేసవిలో పిచ్చి పట్టినట్లు తిరుగుతూ, దాడులు చేస్తున్నాయి. ఇటీవల శ్రీపురంలో వీధికుక్కల దాడిలో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. కుక్కల బారి నుంచి కాపాడాలి.

– బాలనాగులు, శ్రీపురం

అందుబాటులో వ్యాక్సిన్లు..



జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా కుక్కకాటుకు గురైతే వైద్యులను సంప్రదించి, చికిత్స పొందాలి. వేసవి తీవ్రత ఎక్కువ కావడంతో కుక్కకాట్లు పెరిగిపోతున్నాయి.

– సుధాకర్‌లాల్, డీఎంహెచ్‌ఓ

సెల్‌ఫోన్ తెచ్చిన గొడవ..

- విచక్షణారహితంగా దాడి చేయడంతో వ్యక్తి మృతి

హన్వాడ: సెల్‌ఫోన్.. ఇరువురు వ్యక్తుల మధ్య గొడవను తెచ్చింది. ఆ గొడవ కాస్త ప్రాణాలు తీసే దాకా వెళ్లింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని అయోధ్యనగర్ గ్రామం జీనుగడ్డతండాకు చెందిన రేతావత్ నాను నాయక్(36) శనివారం రాత్రి తన చిన్నాన్న కేతావత్ రాందాస్‌ను సెల్‌ఫోన్ ఇవ్వమని కోరగా, తిరస్కరించాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న వీరిద్దరు మాటా మాటా పెరిగి గొడవకు దారి తీసింది. ఈగొడవలో వారి పాలివారైన మరో ముగ్గురు కేతావత్ సంతోష్, రుక్కుబాయి, దేవి బాయిలు నానుపై దాడిచేశారు. దీంతో గొడవ పెద్దదై కర్రలతో దాడి చేసుకునే స్థాయికి చేరింది. కేతావత్ రాందాస్, అతని కుమారుడు సంతోష్, భార్య రుక్కుబాయి, దేవి బాయి కర్రలతో కేతావత్ నాను నాయక్‌పై విచక్షణా రహితంగా దాడి చేయడంతో బాధితుడు అపస్మారకస్థితికి వెళ్లాడు. అర్ధరాత్రి ఆదివారం తెల్లవారుజామున జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతుచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేష్ పేర్కొన్నారు. మృతునికి భార్య, ఆరుగురు కూతుర్లు ఉన్నారు.



కేతావత్ నాను (ఫైల్)

నగదు, మద్యం పట్టివేత



బల్గెర చెక్‌పోస్టు దగ్గర పట్టుబడిన కర్ణాటక మద్యం

గట్టు: కర్ణాటకలోని యరగేర నుంచి ఏపీలోని కర్నూల్ ప్రాంతానికి ఆటోలో అక్రమంగా మద్యాన్ని తరలిస్తుండగా ఆదివారం బల్గెర చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. బోయ రంగన్న కర్ణాటకలోని యరగేర ప్రాంతం నుంచి గుట్టుచప్పుడు కాకుండా పట్టపగలే ఆటోలో కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్నారు. కర్ణాటక సరిహద్దులోని బల్గెర చెక్‌పోస్టు దగ్గర పోలీసులు వాహనాలను తనిఖీ చేపట్టగా ఆటోలో 15 కాటన్ల (129.6 లీటర్లు)మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. మద్యంతో పాటుగా ఆటోను గట్టు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

మాగనూర్: మండలంలోని కోల్పూర్‌లో బెల్టుషాపుపై ఎస్‌ఐ అబ్దుల్ ఖాదర్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి దాడ్నులు చేసి 13.8 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. బెల్టు షాపు యాజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అమ్రాబాద్: పదరలో ఆదివారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్దిమడుగు నుంచి అచ్చంపేట వైపు వెళ్లే జీపులో ప్రయాణిస్తున్న వ్యక్తి వద్ద రూ. 57వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు. అచ్చంపేట మండల లింగోటం నాయిని బాలయ్యగా గుర్తించినట్లు తెలిపారు.

2.80 లక్షల పట్టివేత

వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరి సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా కర్నూల్‌కు చెందిన సంజయ్ నుంచి రూ.2.80లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్‌ఐ నందీకర్ తెలిపారు. కొల్లాపూర్ ప్రాంతంలో వ్యాపారాలు నిర్వహిస్తున్న తాను వ్యాపారం నిమిత్తమై డబ్బును తెచ్చానని బాధితుడు తెలపగా, ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో డబ్బులను ఉన్నతాధికారులకు పంపించినట్లు తెలిపారు.

మహిళా ఉద్యోగిపై యువకుడు అనుచిత ప్రవర్తన

- పట్టుకుని దేహశుద్ధి చేసిన ఆలయ ఉద్యోగులు, భక్తులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ పుణ్యక్షేత్రంలో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా ఉద్యోగితో అనుచితంగా ప్రవర్తించిన యుకుడికి ఆలయ ఉద్యోగులు, భక్తులు దేహశుద్ధి చేసిన ఘటన చోటుచేసుకుంది. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలయంలో ఆదివారం మధ్యాహ్నం విధి నిర్వహణలో ఉన్న సదరు మహిళా ఉద్యోగి ఆలయ ప్రాకార మండపంలో కూర్చుని ఉంది. గరుడబ్రహ్మ ఆలయం నుంచి వచ్చిన ఓ యువకుడు అకస్మాతుగా సదరు మహిళా ఉద్యోగి తలను గట్టిగా పట్టుకున్నాడు. దీంతో మహిళా ఉద్యోగి గట్టిగా కేకలు వేయగా.. సదరు యువకుడు అక్కడి నుంచి పరుగెత్తాడు. ఏం జరిగిందో అర్థం కాని సిబ్బంది సదరు యువకుడిని పట్టుకునేందుకు పరుగెత్తినా అతడు దొరకలేదు. కాసేపు తరువాత మళ్లీ ఆ యువకుడు ఆలయ ప్రాంగణంలోకి రాగా.. ఆలయ ఉద్యోగులు పట్టుకుని ఈఓ ఎదుటకు తీసుకొచ్చి జరిగిన ఘటనను వివరించారు. సదరు యువకుడిని అక్కడున్న భక్తులు ఆలయ సిబ్బంది దేహశుద్ధి చేశారు. అనంతరం ఈఓ పురేందర్‌కుమార్ ఎస్‌ఐకి ఫోన్ చేయగా.. పోలీసులు అక్కడకు చేరుకుని ఆ యువకుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సదరు యువకుడిది కోనేరు గ్రామంగా గుర్తించారు. యువకుడు మద్యం తాగి ఆలయానికి వచ్చినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు. ఈ యువకుడు రెండు రోజులుగా ఆలయంలోనే తిరుగుతున్నాడని ఆలయ సిబ్బంది చెబుతున్నారు.



మహిళా ఉద్యోగితో అనుచితంగా ప్రవర్తించిన యువకుడు

సేంద్రియ వ్యవసాయంతో లాభాలు

పాడి-పంట
అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: వ్యవసాయం పూర్వం సేంద్రియ ఎరువుల ద్వారానే జరిగేది. పూర్వీకులు రసాయన ఎరువులు, పురుగుల మందులు వినియోగించకుండానే పంటలు పండించేవాడు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార దిగుబడులు పెంచడానికి ఆధునిక వంగడాలతోపాటుగా రసాయనాల వినియోగించుకోవాల్సిన అవసరం నెలకొంది. రసాయన ఎరువులు, పురుగుల మందులు అధికంగా వాడుతూ దిగుబడులు పెంచుకోనే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పరిస్థితులను అధిగమించి సేంద్రియం ద్వారా పంటల సాగు ఎంతో నయంగా ఉంటుందని ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచించారు.

రసాయనాల వాడకంతో..

- సాగులో విచక్షణ రహితంగా బస్తాల కొద్ది రసాయన ఎరువులను కుమ్మరించడంతో ఆ మందులను తట్టుకోనే స్థాయి పంటల్ని ఆశించే పురుగుకు పెరుగుతుంది.
- రసాయన ఎరువులు, పురుగుల మందులు అధికంగా వాడకంతో వాటిని తట్టుకోనే స్థాయి పురుగులు, తెగుళ్లు కాలక్రమేనా అధికమైపోతాయి.
- వీటి వినియోగం అధికంగా ఉంటే సాగు ఖర్చు విపరీతంగా పెరుగుతుంది.
- ఆహార ఉత్పత్తుల నాణ్యత తగ్గిపోతాయి.
- సరైన అవగాహన లేకుండా రసాయనాల వాడకం వలన వాటి అవశేషాలు నీటిలో, సాగు నేలలో కలిసి కలుషితమవుతాయి.

నష్టాలు–సూచనలు

- మితిమీరిన రసాయనాల వాడకంతో మిత్ర కీటకాలు నశించి వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది.
- ఆరోగ్యం, పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలి.
- వ్యవసాయంలో పురుగు మందులు, రసాయనాలు లేకుండా చూసుకోవాలి.
- ప్రపంచ ఆరోగ్య సంస్థ వ్యవసాయ ఒప్పందాల ప్రకారం మార్కెట్‌లో పోటీకి మన ప్రాంత రైతులు నిలవాలంటే నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులకే ప్రాధాన్యం ఇవ్వాలి.
- పంట ఉత్పత్తులు తక్కువ ధరలకు లభించేలా సాగు చేసుకోవాలి.



జిలుగు సాగు



జనుము సాగు

సేంద్రియ విధానం

- సాగులో లింగాకర్షన బుట్టలు వాడాలి.
- పరిమితులకు లోబడి బీటీ వైరస్ శిలీంధ్రాన్ని వాడాలి.
- గంధకం, రాగి ఉత్పత్తులు వాడవచ్చు. వృక్ష సంబంధం నూనెల్ని కొన్ని జాగ్రత్తలతో వాడాలి.
- వేప సంబంధిత ఉత్పత్తులు, పచ్చిరొట్ట, వర్మీ కంపోస్టు ఎరువులను వాడాలి.
- పంట వ్యర్థాలు, కొబ్బరి వ్యర్థాలు, షజొల్లా ఉపయోగపడేవే.
- పంటల నుంచి వచ్చే బూడిద, జీవన ఎరువులు, జిప్సం పంటల్లో వాడుకోవచ్చు.

సేంద్రియ ఎరువులతోనే సాధ్యం

- జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో తక్కువ ఖర్చుతో వ్యవసాయం చేసే దిశగ రైతులు అడుగులు వేస్తున్నారు.
- సేంద్రియ ఎరువులైన వానపాముల ఎరువులు, పశువుల ఎరువులు, కోళ్ల ఎరువు, పచ్చి ఆకులు, పిండి చెక్కలు వాడాలి.
- నాణ్యమైన, రుచికరమైన ఉత్పత్తులను పండించి దేశానికి అందించాల్సిన అవసరం ఉంది.
- వ్యవసాయ శాఖ ద్వార చిన్న, సన్నకారు రైతులకు సైతం అందుబాటులో ఉండే వర్మీ కంపోస్టు బెడ్స్ రూ.5 వేల సబ్సిడీపై రైతులు పొందవచ్చు.
- వ్యవసాయ శాఖ ద్వారా పచ్చి రొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలను 5 శాతం సబ్సీడీపై అందిస్తున్నారు.

సేంద్రియ ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌లోకి..

- అంతర్జాతీయ మార్కెట్‌లో సేంద్రియ ఎరువులు నిలవాలంటే నిబంధనలు పాటించాల్సిందే.
- మన ప్రాంతంలోని నేలల్లో సేంద్రియ కర్బణం చాలా వరకు తగ్గిపోయి దిగుబడుల్లో రైతులు ఒడిదుడుకులను ఎదుర్కొవాల్సిన పరిస్థితి నెలకొంది.
- అనేక చోట్ల ఒక శాతం కర్బణం ఉన్నట్లు తెలుస్తోంది.
- సేంద్రియ కర్బనం పెంచడానికి కృషి చేయాలి.
- సేంద్రియ సాగు ద్వారా ఆహార ఉత్పత్తులు సాధించాలంటే ప్రపంచ దేశాలతోపాటు మన ప్రాంతంలో కూడా సేంద్రియ వ్యవసాయం చేసే రైతుల కమతాల్ని పరిశీలించి వారికి ధ్రువీకరణ పత్రం జారీ చేయడానికి కొన్ని ప్రమాణాలను ప్రభుత్వం నిర్ధేశించింది. ఆ జాబితాలు సిద్ధం అవుతున్నాయి.
- ఏదైన ఆహార ధాన్యాలు సేంద్రియ ఉత్పత్తిగా గుర్తించాలంటే సాగులో అనేక ప్రమాణాలు పాటించాల్సి ఉంటుంది.
- అనేక దేశాల్లో కొద్దిపాటి తేడాతో ప్రమాణాలు పాటిస్తున్నారు.
- ప్రమాణాల ప్రకారం నాటే విత్తనాల దగ్గర నుంచి యాజమాన్య పద్ధతులు, పంట మార్పిడి, ప్యాకింగ్ వరకు అనేక జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.
- నిజమైన సేంద్రియ వ్యవసాయాన్ని సమగ్ర పోషక యాజమాన్యం సమగ్ర సస్యరక్షణ కంటే ఒక మెట్టుపై నేనని భావించవచ్చు.
- పంట పోషణ, సస్యరక్షణలో వినియోగించదగిన, నిషేధించిన కొన్ని ప్రధాన ఉత్పాదకాలు ఉన్నాయి.
- నీరు వాతవరణం ఆహారంలో అవశేషాలు ఏర్పడే పురుగు మందులు ఉపయోగించరాదు.

క్లుప్తంగా...

ఆ డబ్బులు మావే ఇచ్చేయండి

- రూ.51,99,800 నగదుతోపాటు చెక్కులు కూడా ఇవ్వండి
- రామోజీరావుకి చెందిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ లొల్లి

సాక్షి, విశాఖపట్నం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విశాఖపట్నంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా.. ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.51,99,800 నగదుతోపాటు రూ.36,88,675 విలువైన 51 చెక్కులను స్వాధీనం చేసుకున్న వ్యవహారంలో పచ్చ పత్రికాధినేత రామోజీరావుకు చెందిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ డ్రామాలకు తెరలేపింది. ఆ నగదుతోపాటు చెక్కులు కూడా తమవేనని చెబుతున్న మార్గదర్శి ఇందుకు సంబంధించిన ఆధారాలు చూపమంటే చూపడం లేదు. దీంతో ఈ సొమ్ము మార్గదర్శిది కాదని.. టీడీపీ నేతలు ఓట్ల కొనుగోలుకు తరలిస్తున్న నగదని అంతా చెబుతున్నారు. ఇప్పటికే ఈ నగదుకు సంబంధించి కేసు కూడా నమోదైంది. అంతేకాకుండా ఈ వ్యవహారం ఆదాయ పన్ను శాఖ పరిధిలోకి వెళ్లిపోయింది. ఆధారాలు చూపించి నగదును తీసుకునే అవకాశం ఉన్నా ఆ పనిచేయకుండా జిల్లా ఎన్నికల యంత్రాంగం చుట్టూ మార్గదర్శి సిబ్బంది తిరగడం చర్చనీయాంశంగా మారింది.

మళ్లీ జగనే సీఎం కావాలని...

- భద్రాచలం రామాలయానికి అభిమానుల పాదయాత్ర



బూర్గంపాడు: ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తూ ఆయన అభిమానులు పాదయాత్ర చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామం నుంచి భద్రాచలం రామాలయానికి ఆదివారం పాదయాత్రగా వెళ్లారు. మొదట రెడ్డిపాలెం రామాలయంలో, ఆ తర్వాత భద్రాచలం రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా వందలాది మంది అభిమానులు పాదయాత్రగా వెళ్లి భద్రాద్రి రామయ్యను దర్శించుకున్నారు. ఐదేళ్లుగా అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే ఆయనకు శ్రీరామరక్షగా నిలుస్తాయని వారు అన్నారు.

బాబును నమ్మితే పులికి బలే

ప్రజలకు మంచి జరుగుతుంటే చూడలేని శాడిస్టు.. కొనకనమిట్ల 'మేమంతా సిద్ధం' సభలో ఏపీ సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ''ప్రకాశం జిల్లా పొదిలిలో ఈరోజు ఇసుక వేసినా రాలనంతగా జనసముద్రం, ప్రజా కెరటం కనిపిస్తోంది. మంచి చేసిన మన ప్రభుత్వానికి మద్దతుగా, ఆ మంచిని కొనసాగించేందుకు చేయీ చేయీ కలిపి చేస్తున్న నినాదమే సిద్ధం.. సిద్ధం! ప్రజల అజెండాతో మనం, జెండాలు జతకట్టి వారు తలపడుతున్న ఈ ఎన్నికల్లో పేదల వ్యతిరేకులను ఓడించి ఇంటింటా అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగించేందుకు మీరంతా సిద్ధమేనా?'' అని ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. 10వ రోజు బస్సు యాత్ర సందర్భంగా ప్రకాశం జిల్లా మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కొనకనమిట్ల జంక్షన్ వద్ద ఆదివారం జరిగిన ''మేమంతా సిద్ధం'' బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్ మాట్లాడారు. ఎండ నిప్పులు చెరుగుతున్నా భారీ ఎత్తున తరలివచ్చిన జనసందోహాన్ని ఉద్దేశించి సీఎం మాట్లాడారు. 'ప్రజల రాజ్యాన్ని, అవ్వాతాతల సంక్షేమ రాజ్యాన్ని, రైతు రాజ్యాన్ని, మహిళా పక్షపాత రాజ్యాన్ని, పిల్లల అభివృద్ధి రాజ్యాన్ని ధ్వంసం చేసేందుకు వస్తున్న మూడు పార్టీల కూటమిని అడ్డుకునేందుకు మీరంతా సిద్ధమేనా? ఈ ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలను, ఎంపీలను ఎన్నుకునేందుకు జరుగుతున్నవి కాదు. గత ఐదేళ్లుగా బాగుపడ్డ మీ పిల్లలు బడులు, చదువులు, అక్కచెల్లెమ్మల సాధికారత, అవ్వాతాతల సంక్షేమం, రైతుకు అందుతున్న భరోసా, సామాజిక న్యాయం.. ఇవన్నీ కొనసాగి మరో రెండు అడుగులు ముందుకు వేయాలా? లేక మోసపోయి వెనక్కు వెళ్లాలా? అన్నది నిర్ణయించే ఎన్నికలు ఇవి. ఈ ఎన్నికలు మన భవిష్యత్తును నిర్దేశిస్తాయి. రెండు అడుగులు ముందుకు వేయాలా? లేక మళ్లీ మోసపోయి వెనక్కు వెళ్లాలా? అనే అంశాన్ని నిర్ణయించే ఎన్నికలు అని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరుతున్నా' అని పేర్కొన్నారు. సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..



టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల 2014 మేనిఫెస్టో చూపిస్తూ.. వారి మోసపూరిత హామీలను వివరిస్తున్న సీఎం జగన్

ఫ్లాష్ బ్యాక్‌లోకి వెళ్దామా?

మన జెండా తలెత్తుకుని రెపరెపలాడుతుంటే.. వారి జెండా మరో నాలుగు జెండాలతో జత కట్టినా కూడా ఎగరలేక కింద పడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. చంద్రబాబు, కూటమి చరిత్ర ఏమిటి? 2014లో ఏం చెప్పారో ఒక్కసారి ఫ్లాష్ బ్యాక్‌లోకి వెళ్దామా? ముఖ్యమైన హామీలు ఒక్కసారి చూద్దాం. రూ.87,612 కోట్ల రైతుల రుణమాఫీ చేశాడా? రూ.14,205 కోట్ల పొదుపు సంఘాల రుణాలు ఒక్క రూపాయి అయినా చేశాడా? ఆడబిడ్డ పుట్టిన వెంటనే మహాలక్ష్మి పథకం కింద రూ.25 వేలు బ్యాంకులో డిపాజిట్ చేశారా? ఇంటింటికీ ఒక ఉద్యోగం లేదంటే రూ.2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నాడు. 60 నెలల్లో నెలకు రూ.2 వేల చొప్పున రూ.1.20 లక్షలు మీ ఇంటికి వచ్చాయా? పేదలకు 3 సెంట్ల స్థలం కథ దేవుడెరుగు ఒక్క సెంటు స్థలమైనా, కనీసం ఒక్కరికైనా ఇచ్చాడా? రూ.10 వేల కోట్లతో బీసీ సబ్ ప్లాన్, చేనేత, పవర్ లూమ్స్ రుణాల మాఫీ.. అయ్యాయా? మహిళల రక్షణకు ఉమెన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేశాడా? రాష్ట్రాన్ని సింగపూర్‌కు మించి అభివృద్ధి చేస్తామన్నాడు చేశాడా? ప్రతి నగరంలోనూ హైటెక్ సిటీ నిర్మిస్తామన్నాడు. మీ పొదిలిలో ఏమన్నా హైటెక్ సిటీ కనిపిస్తోందా? మార్కాపురంలో అయినా కనిపిస్తోందా? పోనీ ఒంగోలులో కనిపిస్తోందా? పోనీ ప్రత్యేక హోదా ఇచ్చారా? ఇదే చంద్రబాబు మరోసారి కూటమి కట్టి మళ్లీ వస్తున్నాడు. చంద్రబాబును నమ్మడం అంటే పులి నోట్లో తలకాయ పెట్టడమే. ఇలాంటి మోసగాళ్ల బారి నుంచి రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకునేందుకు మీరంతా సిద్ధమేనా? సెల్ ఫోన్ టార్చ్ లైట్ వెలిగించి సిద్ధమే అని గట్టిగా నినదించండి.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అడవి తల్లిని వీడం.. బయటకెళ్లి బతకలేం

▶ మొదటి పేజీ తరువాయి

బలవంతంగా అడవి బయటకు తరలించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని ఆందోళన చెందుతున్నారు.

ఎన్టీసీఏ ద్వారా పునరావాస ప్యాకేజీ.. అయినా చెంచులు విముఖం

అడవి లోపల నివసిస్తున్న వారిని బయటకు తరలిస్తే ఒక్కో కుటుంబానికి ఎన్టీసీఏ ద్వారా రూ.15 లక్షల పునరావాస ప్యాకేజీ అందించనుంది. వీరి పునరావాసం కోసం నాగర్‌కర్నూల్ జిల్లాలోని పెద్దకొత్తపల్లి మండలం బాచారం వద్ద అటవీశాఖకు చెందిన స్థలాన్ని కేటాయించారు. రూ.15 లక్షల ప్యాకేజీ వద్దనుకుంటే బాచారం వద్ద 220 గజాల స్థలంలో ఇంటి నిర్మాణం, జీవనోపాధి కోసం 5 ఎకరాల వ్యవసాయ భూమిని అందజేస్తారు. సార్లపల్లిలో 269 కుటుంబాలు ఉండగా, వీరిలో 83 కుటుంబాలు మాత్రమే చెంచులు కాగా, మిగతా వారిలో ఇతర వర్గాల సంఖ్యే ఎక్కువగా ఉంది. ఎన్టీసీఏ ప్యాకేజీకి ఇప్పటి వరకు 186 కుటుంబాలు అంగీకరించగా, వీరిలో చెంచు కుటుంబాలు ఆరు మాత్రమే ఉన్నాయి. అడవి నుంచి బయటకు తరలింపునకు మెజార్టీ శాతం చెంచు కుటుంబాలు విముఖత వ్యక్తం చేస్తున్నాయి.

కనీస సౌకర్యాలు లేకున్నా..

నల్లమల అటవీప్రాంతంలో మొత్తం 88 ఆవాసాల్లో చెంచులు నివసిస్తున్నారు. వీటిలో 20 ఆవాసాలు అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని కోర్ ఏరియాలో ఉన్నాయి. అడవిలో అటవీ శాఖ ఆంక్షల నేపథ్యంలో ఇక్కడి చెంచులు కనీస మౌలిక సదుపాయాలకు సైతం నోచుకోవడం లేదు. టైగర్ రిజర్వ్ ప్రాంతం కావడంతో పులులు, వన్యప్రాణుల సంరక్షణను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు. అడవిలో ఉన్న అప్పాపూర్ గ్రామ పంచాయతీ మినహా మరెక్కడా చెంచుపెంటల్లో కనీసం అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల, వైద్యశాల లేవు. తాగునీటికి సైతం ఎలాంటి సురక్షిత మంచినీటి వ్యవస్థ అందుబాటులో ఉండదు. స్థానికంగా సోలార్ బోరు ద్వారా వచ్చే నీటితో పాటు కుంటలు, చెలిమెల నీటినే చెంచులు నిత్యం తాగేందుకు వినియోగిస్తున్నారు.



మల్లాపూర్ పెంటలోని చెంచుల ఆవాసాలు

మేం అడవిలోనే ఉంటాం.. బయటకు పోలేం



ఏళ్లుగా తాతల కాలం నుంచి అడవినే నమ్ముకుని బతుకుతున్నాం. మేం బయటకు పోయి జీవించలేం. మా వల్ల వన్యప్రాణులు, పులులకు ఎలాంటి హాని లేదు. ఇప్పుడు కూడా ఉండదు. దయచేసి మమ్మల్ని అడవి నుంచి విడదీయద్దు. మేమంతా అడవిలోనే ఉంటాం.

–చిగుర్ల లింగమ్మ, చెంచు మహిళ, సార్లపల్లి, అమ్రాబాద్ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా

మమ్మల్ని ఆగం చేయొద్దు..



అడవిలో జీవిస్తూ ప్రశాంతంగా ఉన్న మమ్మల్ని ఆగం చేయద్దు. మా వాళ్లు బయటి ప్రపంచంలో బతకలేరు. బాచారం లాంటి మైదాన ప్రాంతాలకు తరలిస్తే అక్కడ ఏజెన్సీ నియమాలు, హక్కులు వర్తించవు. మైదాన ప్రాంతాల్లో ఉన్న చెంచులు మాకంటే దుర్భరమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారు. అడవి నుంచి బయటకు పంపితే చెంచుల ఉనికికే ప్రమాదం ఉంది.

– కుడుముల మల్లేశ్, చెంచు యువకుడు, సార్లపల్లి గ్రామం

స్వచ్ఛందంగా ముందుకు వస్తేనే తరలింపు



టైగర్ రిజర్వ్ ప్రాంతాల్లో అమూల్యమైన వన్యప్రాణుల సంరక్షణ కోసం, వాటికి ముప్పును నివారించేందుకే స్థానికులకు మరోచోట పునరావాసం కల్పిస్తున్నాం. అడవిలో వారికి ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు సాధ్యం కాదు. పునరావాస కాలనీల్లో అన్ని వసతులు కల్పిస్తాం. రీలొకేషన్‌లో ఎలాంటి ఒత్తిడి లేదు, స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారినే తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– రోహిత్ గోపిడి, డీఎఫ్‌ఓ,నాగర్‌కర్నూల్ జిల్లా

రాష్ట్రం సరఫరా చేసిన బియ్యంలో ఖాప్రా పురుగు

- పలువురు సిబ్బందిపై ఎఫ్‌సీఐ వేటు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నుంచి ఎఫ్‌సీఐకి సరఫరా అయిన బియ్యంలో ఖాప్రా అనే పురుగు ఉన్నట్లు తేలింది. ఈ మేరకు చెన్నైలోని ఎఫ్‌సీఐ జోనల్ కార్యాలయానికి ఫిర్యాదులు అందాయి. దీంతో స్పందించిన సంస్థ.. తెలంగాణకు చెందిన ఆరుగురు ఎఫ్‌సీఐ మేనేజర్లు, 14 మంది టెక్నికల్ సిబ్బందిపై సస్పెన్షన్ వేటు వేసింది. తెలంగాణ నుంచి తమిళనాడు, కేరళ, కర్ణాటకలోని పలు ప్రాంతాలకు కస్టమ్ మిల్లింగ్ రైస్ కింద పంపిన బియ్యం వ్యాగన్లకుగాను కొన్నింటిలో ఖాప్రా పురుగు ఉన్నట్లు ఫిర్యాదులు రావడంతో బాధ్యులపై ఎఫ్‌సీఐ ఈ మేరకు చర్యలు చేపట్టింది.

బాధ్యులందరికీ నోటీసులు

▶ మొదటి పేజీ తరువాయి

నియమిస్తూ గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. బీఆర్‌కేఆర్ భవన్‌లోని 7వ అంతస్తులో కమిషన్ ఆఫ్ ఎంక్వైరీకి కేటాయించిన కార్యాలయంలో ఆదివారం జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి న్యాయవిచారణ ప్రక్రియ ప్రారంభించి ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి, ట్రాన్స్‌కో, జెన్‌కో సంస్థల సీఎండీ ఎస్ఏఎం.రిజ్వీ, ఇతర అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గడువు మేరకు 100 రోజుల్లోగా నివేదిక సమర్పిస్తామన్నారు. నాటి నిర్ణయాల్లో భాగస్వాములైన అధికారులే ఇంకా విద్యుత్ సంస్థల డైరెక్టర్లుగా కొనసాగుతూ న్యాయ విచారణలో కమిషన్‌కు సహకరిస్తున్నారని, రాష్ట్రంలో ప్రభుత్వం మారిన వెంటనే ఫైళ్లు తారుమారు చేసినట్టు ఆరోపణలూ వచ్చాయని విలేకరులు జస్టిస్ నరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, మూడు ఒప్పందాలకు సంబంధించిన అన్ని ఫైళ్లు తమ కార్యాలయానికి చేరాయని ఆయన బదులిచ్చారు. వాటి ప్రాథమిక పరిశీలన కూడా పూర్తయిందన్నారు. అవసరమైతే ఇంకా ఫైళ్లు అడుగుతామని చెప్పారు. కాంపిటీటివ్ బిడ్డింగ్‌కి బదులుగా నామినేషన్లు, లిమిటెడ్ టెండర్ల పేరుతో రూ.వందల కోట్ల సివిల్ పనులు కాంట్రాక్టర్లకు అప్పగించిన అంశంతోపాటు యాదాద్రి విద్యుత్ కేంద్రం భూసేకరణలో అవకతవకతలపై సైతం విచారణ నిర్వహిస్తారా? అని విలేకరులు ప్రస్తావించగా ఆయన సమాధానం దాటవేశారు.

ఇల్లు లేని జర్నలిస్టులకు న్యాయం చేస్తాం



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఇల్లు లేని జర్నలిస్టులకు న్యాయం చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం డీసీసీబీ మీటింగ్ హాల్‌లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఇల్లు లేని జర్నలిస్టులకు ఇంటి స్థలం ఇస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టులు అంటే సమాజంలో గౌరవం ఉందని, నిజాలను నిర్భయంగా రాసే వాళ్లే అసలైన జర్నలిస్టులన్నారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్‌అలీ మాట్లాడుతూ జర్నలిజం విలువలను బాధ్యత ప్రతి జర్నలిస్టుపై ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి శ్రీను, జిల్లా అధ్యక్షుడు దత్తేందర్, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

1,012 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం 1,012 అడుగుల నీటిమట్టం ఉంది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నారు.

సా..గుతున్న మున్సిపల్ భవన నిర్మాణం

జడ్చర్ల టౌన్: మున్సిపల్ కార్యాలయ నూతన భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ కార్యాలయాన్ని తాత్కాలికంగా కావేరమ్మపేట (పాత జీపీ భవనం)లో ఏర్పాటు చేశారు. అయితే మున్సిపాలిటీ పరిధిలో అత్యధిక వార్డులు, జనాభా బాదేపల్లిలో ఉన్నాయి. ప్రస్తుత కార్యాలయం బాదేపల్లికి 2 కి.మీ., దూరంలో ఉంటుంది. ఈ కారణంగా ఏ చిన్న పనికైనా కార్యాలయం వెళ్లాలంటే వ్యయప్రయాసాలు తప్పడం లేదు. కార్యాలయ భవన నిర్మాణం పూర్తయ్యే వరకు వార్డు కార్యాలయమైనా ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నప్పటికీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. అనేక అవాంతరాల మధ్య 2018లో జడ్చర్ల మున్సిపాలిటీ ఏర్పడగా.. అప్పటికే మున్సిపాలిటీగా ఉన్న బాదేపల్లి కార్యాలయాన్నే కొనసాగించారు. కావేరమ్మపేట, జడ్చర్ల వాసుల సౌకర్యార్థం కొన్నాళ్లు కావేరమ్మపేట భవనంలో వార్డు కార్యాలయం కొనసాగించి మేనేజర్‌ను అందుబాటులో ఉంచారు. ఇదే క్రమంలో బాదేపల్లిలో ఉన్న కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవనం చేపట్టేందుకు రూ.2.50 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఏడాది క్రితం పనులు ప్రారంభించారు.



నిర్మాణంలో ఉన్న మున్సిపల్ నూతన భవనం

భవన పనులు ప్రారంభించేందుకు గాను పాత భవనాన్ని నేలమట్టం చేయాల్సి రావడంతో కార్యాలయాన్ని కావేరమ్మపేట భవనంలోకి తరలించారు. గతేడాది ఆరంభంలోనే కార్యాలయాన్ని తరలించి పాతభవనం కూల్చేశారు. దీంతో కార్యాలయం దూరం కావడంతో బాదేపల్లి వాసులు, నాగసాల గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. పన్నుల చెల్లింపు, సర్టిఫికెట్లు తీసుకోవడం, సమస్యలు విన్నవించుకునేందుకు వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. మహిళా సమాఖ్య సభ్యులకు కష్టాలు వెంటాడుతున్నాయి. ఈ నిర్మాణం పూర్తయ్యే వరకు వార్డు కార్యాలయం ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అయితే కార్యాలయం త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని, వార్డు కార్యాలయం ఏర్పాటు చేయలేమని మున్సిపల్ కమిషనర్ రాజయ్య వెల్లడించారు. 8 నెలల్లో నూతన భవనం అందుబాటులోకి తీసుకువచ్చేలా చూస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి తెలిపారు.

ప్రకృతి ఆహారంతో ఆరోగ్యం

వ్యవసాయ నిపుణుడు విజయరాం

మక్తల్: ప్రకృతి ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వ్యవసాయ నిపుణుడు విజయరాం అన్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ మండలం మంతన్‌గోడ్‌కు చెందిన శశిధర్, రాజశేఖర్‌లు గోఆధారిత వ్యవసాయంతో పండించిన ఆహారాన్ని 45 రోజులపాటు 60 మందికి ఉచితంగా అందజేశారు. ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి విజయరాం హాజరై మాట్లాడారు. దేశీయ వంగడాలతో ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఆహారం ఆరోగ్య సంరక్షణకు గొప్ప ఔషధమని అన్నారు. 45 రోజులపాటు ప్రకృతి ఆహారం తీసుకున్న వారిలో షుగర్, కీళ్లనొప్పులు, ఊబకాయం తదితర వ్యాధులు తగ్గినట్లు వైద్యులు నిర్ధారించారని చెప్పారు. ప్రతిఒక్కరూ ప్రకృతి ఆహారం తీసుకోవాలని సూచించారు. డాక్టర్ రాంకిషన్ మాట్లాడుతూ మందుల ద్వారా జబ్బులు పూర్తిగా తగ్గవని.. ఆహారమే ఔషధమన్నారు. రసాయనాలు లేకుండా పండించిన ఆహారం తీసుకోవడం వల్ల ఊబకాయం వంటి జబ్బుతోపాటు క్యాన్సర్ కూడా తగ్గుతుందన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా కూరగాయలు, వరి, నూనె గింజలను పండించాలని కోరారు. సీనియర్ జర్నలిస్టు రాంబాబు



మాట్లాడుతున్న వ్యవసాయ నిపుణులు ప్రకృతి విజయరాం

మాట్లాడుతూ.. ఐసీఏఆర్, ఐసీఎంఆర్ ఇటీవల నిర్వహించిన అధ్యయనంలో 50 ఏళ్లలో వరి, గోధుమల పోషకాలు 45 శాతం తగ్గిపోయాయని గుర్తించినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ దేశీయ వంగడాల ఆవశ్యకతను గుర్తించాలని కోరారు. కాగా.. మంతన్‌గోడ్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు శశిధర్, రాజశేఖర్ ప్రకృతి ఆహారంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. అనంతరం వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో తాము ప్రకృతి ఆహారంపై అవగాహన కల్పిస్తున్నట్లు శశిధర్, రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రకృతి ప్రసాద్, మోహన్, శశిధర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


దేవుని వారసులుగా ఉండాలి



అంతర్జాతీయ ప్రసంగికులు ఇవాలజిస్ట్ కృష్ణను సన్మానిస్తున్న సంఘ పెద్దలు

స్టేషన్ మహబూబ్‌నగర్: విశ్వాసాన్ని తుదివరకు కాపాడుకొని నిత్య రాజ్యంలో దేవుని వారసులుగా చిరకాలం ఉండేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని దుబాయ్‌కి చెందిన అంతర్జాతీయ ప్రసంగికులు ఇవాలజిస్ట్ కృష్ణ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని రెమా వర్షిప్ సెంటర్‌లో ఆదివారం పాస్టర్ బీఎస్.పరంజ్యోతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. లోకంలో మనల్ని భయపెట్టే సంఘటనలు ఎన్నో ఎదురవుతాయని, వాటికి భయపడకుండా దేవునిపై మన విశ్వాసాన్ని కాపాడుకోవాలన్నారు. దేవుడు మన కోసం సమస్తాన్ని సమకూర్చారని, ఇందుకు మనం విశ్వాసంగా ఉన్నట్లయితే వాటిని గుర్తెరుగుతామని అన్నారు. యేసుక్రీస్తు ప్రభువు మన కోసం ఈ లోకానికి వచ్చి సిలువలో తన ప్రాణాన్ని అర్పించి మూడో రోజు తిరిగి లేచి పరలోక ఆరోహణమయ్యాడని అన్నారు. అనంతరం ఇవాలజిస్ట్ కృష్ణను సంఘ పెద్దలు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో దేవయ్య, లక్ష్మన్న, శ్యాంసుందర్, భరత్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర క్షేత్రం.. భక్త జనసంద్రం



కోనేరు వద్ద భక్తులు



అలంకరణలో స్వామి వారు

అడ్డాకుల: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందుతున్న కందూర్ రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జాతర అంగరంగ వైభవంగా సాగుతోంది. ఆదివారం సెలవు దినం కావడంతో పాటు ఉగాది పండుగ సమీపించడంతో జాతరకు భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు కోనేరులో స్నానాలు చేసి ప్రధాన ఆలయంలోని శివలింగానికి అభిషేకాలు చేశారు. స్వామి దర్శనం కోసం భక్తులు ఆలయ ఆవరణలో బారులు తీరారు. ఆలయ పరిసరాల్లోని దుకాణాలు భక్తులతో కిటకిటలాడాయి. కందూరుకు వెళితే కాశీకి వెళ్లినంత పుణ్యం వస్తుందనే భావనలో భక్తులు ఆలయ కోనేరు ఆవరణలో ఉన్న కల్పవృక్షాల కింద భోజనాలు చేసి సేద తీరారు.



దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

ఒకే వేదికపై ప్రత్యర్థులు

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో విమర్శలు, ప్రతివిమర్శలతో రాజకీయ హీటెక్కించే కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఒకేచోటకు చేరుకున్నారు. అమరచింతలో అడ్వకేట్ మాజీ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌కు బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరయ్యారు. ఇఫ్తార్ అనంతరం ఎవరంతకు వారు వెళ్లిపోయారు.

– అమరచింత

